

మామిడిలో మెరుగైన పూత

ప్రస్తుతం మామిడిపూత బాగా రావడానికి రైతులు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని ఉద్యానశాఖ అధికారి రమేష్ తెలిపారు.

- 8లో▸



అతడు కీచకుడే..

హనుమకొండ జిల్లా భీమారంలోని ఓ ఇంటర్ కళాశాలలో చదువుతున్న విద్యార్థినిపై అసభ్యకరంగా ప్రవర్తించిన కళాశాల అధ్యక్షుడిని అరెస్ట్ చేసినట్లు పోలీసులు తెలిపారు.

- 8లో▸

గరిష్టం/కనిష్టం
$30^0/15^0$

వాతావరణం

జిల్లాలో ఉదయం మంచు కురుస్తుంది. మధ్యాహ్నం ఉష్ణోగ్రత మామూలుగా ఉంటుంది. రాత్రి చలి తీవ్రత ఎక్కువగా ఉంటుంది.

న్యూస్‌రీల్

దరఖాస్తుల ఆహ్వానం

జనగామ రూరల్: మహాత్మా జ్యోతిబా పూలే గురుకుల ప్రవేశాల ప్రవేశ పరీక్షకు దరఖాస్తు చేసుకోవాలని గురుకుల పాఠశాలల జిల్లా కన్వీనర్ ఎం.అనిత ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. 4వ తరగతి పూర్తి చేసి 5వ తరగతిలో ప్రవేశానికి పరీక్ష రాయాల్సి ఉంటుందన్నారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ విద్యార్థులు ఆన్‌లైన్ దరఖాస్తు చేసుకోవాలని, జనవరి 6వ తేదీలోపు దరఖాస్తు చేసుకోవాలన్నారు. ఫిబ్రవరి 11న జిల్లా కేంద్రంలో ప్రవేశ పరీక్ష ఉంటుందని, మెరిట్ ఆధారం ప్రవేశాలు ఉంటాయన్నారు. మరిన్ని వివరాలకు 7993456814, 9963185244 సెల్ నంబర్లను సంప్రదించాలని పేర్కొన్నారు.

ఫిలిం సర్టిఫికేషన్ సలహా కమిటీ బోర్డు సభ్యుడిగా కోటేశ్వర్




కొడకండ్ల: సెంట్రల్ బోర్డు ఆఫ్ ఫిలిం సర్టిఫికేషన్ సలహా కమిటీ సభ్యుడిగా సుంకరనేని కోటేశ్వర్ నియామకమయ్యారు. మండలకేంద్రానికి చెందిన కోటేశ్వర్ 1977లో ఆర్‌ఎస్‌ఎస్ కార్యకర్తగా పనిచేసి బీజేవైఎం, బీజేపీలో క్రియాశీలకంగా పనిచేసి మండల, నియోజకవర్గ, ఉమ్మడి జిల్లా, రాష్ట్ర స్థాయి పదవులు నిర్వర్తించాడు. తనపై అప్పగించిన ఈ బాధ్యతను సమర్థవంతంగా నిర్వర్తిస్తానని, తన నియామకానికి కృషి చేసిన బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు కిషన్‌రెడ్డి, జాతీయ కార్యదర్శి బండి సంజయ్, జిల్లా అధ్యక్షుడు దశమంత్‌రెడ్డి తదితరులకు కృతజ్ఞతలు తెలిపారు.

ఆత్మహత్యలు లేని సమాజానికి కృషి



జనగామ రూరల్: ఆత్మహత్యలు లేని సమాజానికి ప్రతిఒక్కరు కృషి చేయాలని నివారణ కమిటీ చైర్మన్ డాక్టర్ పరికిపండ్ల అశోక్ అన్నారు. ఆదివారం పట్టణంలోని ఆరోగ్య మిత్ర స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో పద్మశాలి సంఘం జిల్లా అధ్యక్షుడు వేముల బాలరాజు అధ్యక్షతన ఆత్మహత్యల నివారణపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆత్మహత్య చేసుకునే వ్యక్తిపై సమాజం స్వాంతన చేకూర్చి మానసిక ధైర్యం అందించాలని కోరారు. తనకు ఎవరు లేరనే భావన లేకుండా మేమున్నామనే భావన కల్పించి బతకాలనే భరోసా కల్పించాలన్నారు. ఈ సందర్భంగా ఆత్మహత్య చేసుకోమని ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమంలో సంస్థ ప్రతినిధి సహజ, గంజి శ్రీనివాస్, వి. కిషోర్, నామాల శ్రీనివాస్, రాజేంద్రప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

ఆటో కార్మికులను ఆదుకోవాలి



జనగామ రూరల్: ఉచిత బస్సు సర్వీస్‌లతో ఆటో కార్మికులు ఉపాధి కోల్పోతున్నారని, ప్రత్యామ్నాయ మార్గాలను అమలు చేస్తూ ఆటో రంగ కార్మికుల కుటుంబాలను ఆదుకోవాలని ఆటో యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు వేముల మారయ్య అన్నారు. ఆదివారం జిల్లా కేంద్రంలో కార్మికుల సమస్యలపై రాష్ట్ర బృందం సర్వే నిర్వహించి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా పలు డిమాండ్‌లతో కూడిన వాల్ పోస్టర్‌ను ఆవిష్కరించారు. అనంతరం వారు మాట్లాడుతూ మాట్లాడుతూ ఒక పక్క కేంద్రం మోటారు కార్మిక వ్యతిరేక కార్మిక చట్టాలు, మరో పక్క ఫైనాన్స్ వారి వేధింపులతో మనోవేదనకు గురి అవుతున్నారని, తక్షణమే ప్రభుత్వం ఆదుకోవాలని డిమాండ్ చేశారు. ఆటో కార్మికులకు నెలకురూ. 15,000 అందించాలన్నారు. ఈ కార్యక్రమంలో డీఆర్‌టీయూ జిల్లా అధ్యక్షుడు వేముల నర్సింగం, పరుశరాములు, మోహిన్, అస్లాం, సర్వర్, సులేమాన్, కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

శ్వేతార్కుడికి కుంకుమాభిషేకం

కాజీపేట: కాజీపేట 62వ డివిజన్ విష్ణుపురి కాలనీలోని స్వయంభు శ్రీ శ్వేతార్కమూలగణపతి దేవాలయంలో ఆదివారం ధనుర్మాసోత్సవ వేడుకలను పురస్కరించుకుని 308 కిలోల కుంకుమతో స్వామి వారికి అభిషేకం నిర్వహించారు. భక్తులు సమర్పించిన కుంకుమతో ఆలయ వైదిక కార్యక్రమాల నిర్వాహకులు అయినవోలు సాయికృష్ణశర్మ ఆధ్వర్యంలో అర్చకులు అభిషేకం చేశారు. పూజలు ముగిసిన పిదప భక్తులందరికి మహాన్నదానం చేశారు.

హాస్టల్‌లో చలిలో చదువుకుంటున్న విద్యార్థులు, చలిని లెక్క చేయకుండా గ్రామాలకు వెళ్తున్న చిరువ్యాపారి, చలిమంటలు కాగుతున్న కాలనీ వాసులు







వణికిస్తున్న చలి

పడిపోతున్న ఉష్ణోగ్రతలు

- చలి మంటలు కాగుతున్న ప్రజలు
- ఉన్ని దుస్తులకు పెరుగుతున్న డిమాండ్

జిల్లాలో ఉష్ణోగ్రతల వివరాలు	తేదీ	15	16	17	18	19	20	21	22	23	24
	కనిష్ఠ	13.7	15.4	15.0	14.6	14.0	13.0	10.4	10.2	12.0	13.7

జనగామ: చలి ప్రజలను వణికిస్తోంది. రోజురోజుకు పడిపోతున్న కనిష్ఠ ఉష్ణోగ్రతలతో చేతులు ముడుచుకుపోయే పరిస్థితి నెలకొంది. రాగల మూడు రోజుల పాటు చలితీవ్రత పెరిగే అవకాశం ఉందని వాతావరణ శాఖ సూచిస్తుంది. తెల్లవారుజాము నుంచి 9 గంటల వరకు పొడి వాతావరణంతో సమయం తెలియకుండా పోతుంది. మధ్యాహ్నం 12 నుంచి 4 వరకు వాతావరణంలో కొంత మేర వేడి వాతావరణం కనిపిస్తుండగా, సాయంత్రం 5 గంటల నుంచి చలి ప్రభావం దడ పుట్టిస్తుంది. జిల్లాలో ఫ్యాన్లు, ఏసీలకు స్వస్తి పలికారు. రాత్రి 7 దాటిందంటే ఇంటి ప్రధాన ద్వారాలను మూసివేస్తున్నారు. కిటికీలకు కర్టెన్లు కట్టేస్తూ, గాలి ఇంట్లోకి దూరకుండా విశ్వప్రయత్నం చేస్తున్నారు. మంచుగడ్డను తలపించేలా చల్లబడి పోతున్న గోడల నుంచి వచ్చే చలిని తట్టుకోలేక పోతున్నారు. చెద్దర్లు, బ్లాంకెట్లు కప్పుకుని ముడుచుకున్నా, చలి లోనికి చొచ్చుకువస్తుంది. గత పది రోజులుగా చలి ప్రభావం అంతకంతకు పెరుగుతుంది. ఉష్ణోగ్రతలు పడిపోతుండడంతో ఇటువంటి పరిస్థితులు నెలకొంటున్నాయి. దీంతో ఉన్ని దుస్తులకు ఒక్కసారిగా డిమాండ్ పెరిగింది. జిల్లాలో రోజువారీగా ఉన్ని వ్యాపారం రూ.5 లక్షల పైమాటే.

వృద్ధులు, చంటి పిల్లలపై ప్రభావం

ఉష్ణోగ్రతలు ఊహించని విధంగా పడిపోతుండడంతో చంటి పిల్లలు, వృద్ధులు తీవ్ర ప్రభావం చూపిస్తోంది. వీరు వీలైనంత వరకు బయటకు రాకపోవడమే మంచిది. అత్యవసర సమయంలో ఎక్కడికైనా వెళ్లేవారు, ముఖానికి ఉన్ని దుస్తులు ధరించి, ముక్కు, చెవుల్లోకి గాలి వెళ్లకుండా జాగ్రత్తలు తీసుకుంటున్నారు. రక్తం గడ్డకట్టే పరిస్థితిలో కనిష్ఠ ఉష్ణోగ్రతలు నమోదవుతుండడంతో ఉదయం, సాయంత్రం, రాత్రి వేళ్లలో చలిమంటలు కాచుకుంటూ, వెచ్చదనాన్ని ఆస్వాదిస్తున్నారు. జలుబు, దగ్గు, స్వల్ప జ్వరంగా ఉంటే, వెంటనే డాక్టర్లను సంప్రదిస్తున్నారు. వ్యాపారులు రాత్రి 7.30 గంటల వరకే దుకాణాలను మూసి వేస్తుండగా, ప్రధాన కూడళ్లు నిర్మానుష్యంగా మారిపోతున్నాయి. ఆర్టీసీ, ప్రైవేట్ డ్రైవర్లు చలి తీవ్రతతో డ్రైవింగ్ చేయలేక అవస్థలు పడుతున్నారు.



చలిలో రోడ్డును శుభ్రం చేస్తున్న మున్సిపల్ శానిటేషన్ కార్మికురాలు

పేపర్ బాయ్స్.. రైతులకు కష్టాలు

దినపత్రికలు వేసేందుకు తెల్లవారు జాము 3.30 గంటల వరకే అడ్డాకు చేరుకుంటున్న పేపర్ బాయ్స్, పొలం పనులు, పాల సేకరణ కోసం వెళ్లే రైతులు, చిరు వ్యాపారులు, హోటళ్ల నిర్వాహకులు చలిలో గజగజ వణికుతూ, పనులు చేసుకుంటున్నారు. గీత కార్మికుల కష్టం చలికాలంలో వెలకట్టలేనిది. చేతులు, కాళ్లు ముడుచుకుపోయే కనిష్ఠ ఉష్ణోగ్రతలకు పడిపోతున్నా, కల్లు గీసేందుకు చెట్టు పైకి ఎక్కుతున్నారు. చలి మంటలు కాచుకుంటూ, ఒక టీ కప్పు తాగేస్తూ, ఉపశమనం పొందుతున్నారు.

‘ప్రజాపాలన’పై దిశానిర్దేశం









సమావేశంలో పాల్గొన్న మంత్రులు కొండా సురేఖ, సీతక్క, కలెక్టర్ శివలింగయ్య, సీపీ అంబర్ కిషోర్ ఝూ

హైదరాబాద్‌లోని తెలంగాణ సచివాలయంలో ఆదివారం ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ‘ప్రజాపాలన’ కార్యక్రమం నిర్వహణ సమావేశంలో ఉమ్మడి జిల్లా నుంచి ప్రాతినిధ్యం వహిస్తున్న మంత్రులు కొండా సురేఖ, సీతక్క, కలెక్టర్ శివలింగయ్యతో పాటు వరంగల్ పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝూ పాల్గొన్నారు. గ్రామాలు, మున్సిపాలిటీల్లో ఈనెల 28 నుంచి జనవరి 6వ తేదీ వరకు ఉదయం, సాయంత్రం సమావేశాలు నిర్వహించాలని దిశానిర్దేశం చేశారు. ఇందులో ప్రభుత్వం తరపున చేపట్టనున్న కార్యక్రమాల గురించి వివరించాలని ఆదేశించారు. - జనగామ

దర్శనం కోసం లైన్‌లో నిల్చున్న భక్తులు





స్వామివారికి అభిషేకం చేస్తున్న భక్తులు

సోమేశ్వర ఆలయంలో భక్తుల సందడి

పాలకుర్తి టౌన్: శ్రీ సోమేశ్వర లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో భక్తుల సందడి నెలకొంది. ఆదివారం సెలవు దినం కావడంతో వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు స్వామివారిని దర్శించుకుని అభిషేకాలు, అర్చనలు నిర్వహించారు. భక్తులకు ఇబ్బందులు కలుగకుండా ఆలయ ఈఓ బి.లక్ష్మీ ప్రసన్న పర్యవేక్షించారు.

జిల్లా ఇన్‌చార్జ్ మంత్రిగా ‘పొంగులేటి’!

- ఖమ్మం జిల్లాకు చెందిన శ్రీనివాస్‌రెడ్డికి వరంగల్ బాధ్యతలు
- సుమారు పదేళ్ల తర్వాత ఇతర జిల్లా నుంచి కేటాయింపు
- బీఆర్‌ఎస్ హయాంలో సొంత జిల్లా వారికే అవకాశం



పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి

సాక్షిప్రతినిధి, వరంగల్: ఉమ్మడి వరంగల్ జిల్లా ఇన్‌చార్జ్ మంత్రిగా పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డిని ప్రభుత్వం నియమించింది. ఇటీవల జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో ఉమ్మడి ఖమ్మం జిల్లా పాలేరు నియోజకవర్గం నుంచి గెలుపొందిన శ్రీనివాస్‌రెడ్డి.. ఈ ప్రభుత్వంలో రెవెన్యూ, గృహనిర్మాణ, సమాచార శాఖల మంత్రిగా వ్యవహరిస్తున్నారు. తెలంగాణలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రావడం, మంత్రివర్గ కూర్పు పూర్తయిన కొద్ది రోజులకే సీఎం రేవంత్‌రెడ్డి జిల్లాలకు ఇన్‌చార్జ్ మంత్రులను నియమించారు. బీఆర్‌ఎస్ ప్రభుత్వం హయాంలో ఉమ్మడి వరంగల్ జిల్లాకు చెందిన మంత్రులు ఎర్రబెల్లి దయాకర్‌రావు, సత్యవతిరాథోడ్‌కు ఇన్‌చార్జ్ మంత్రులుగా బాధ్యతలు అప్పగించారు. ఎర్రబెల్లి దయాకర్‌రావు జనగామ, వరంగల్, హనుమకొండ జిల్లాలకు, సత్యవతిరాథోడ్ మహబూబాబాద్, ములుగు, జేఎస్ భూపాలపల్లి జిల్లాలకు ఇన్‌చార్జ్ మంత్రిగా వ్యవహరించారు. అయితే కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వం మాత్రం ఉమ్మడి జిల్లాకు ఒకే మంత్రిని.. అది ఇతర జిల్లాకు చెందిన పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డిని నియమించింది. గతంలోనూ(రాష్ట్ర విభజనకు ముందు) కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వం రాంరెడ్డి వెంకట్‌రెడ్డిని జిల్లా ఇన్‌చార్జ్ మంత్రిగా కొనసాగించింది.

పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి గురించి..

రాజకీయాల్లో తనకంటూ ప్రత్యేకత కలిగిన మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి .. 2014లో జరిగిన సార్వత్రిక ఎన్నికల్లో వైఎస్‌ఆర్ సీపీ నుంచి ఖమ్మం ఎంపీ అభ్యర్థిగా పోటీ చేసి గెలుపొందారు. పాలేరు ఎమ్మెల్యే, మాజీ మంత్రి రాంరెడ్డి వెంకట్‌రెడ్డి 2016లో మృతి చెందారు. అదే సంవత్సరం పొంగులేటి అప్పటి టీఆర్‌ఎస్ పార్టీలో చేరారు. రాంరెడ్డి వెంకట్‌రెడ్డి మృతితో వచ్చిన ఉపఎన్నికల్లో తుమ్మల నాగేశ్వర్‌రావు బీఆర్‌ఎస్ నుంచి గెలుపొందాడు. తుమ్మల గెలుపులో శ్రీనివాస్‌రెడ్డి కీలకంగా వ్యవహరించారు. అయితే 2019 వరకు పార్లమెంట్ సభ్యుడిగా కొనసాగిన తనకే తర్వాత ఎన్నికల్లో బీఆర్‌ఎస్ అధినేత కేసీఆర్ తిరిగి ఖమ్మం ఎంపీ టికెట్ ఇస్తారని ఆశించగా.. నామా నాగేశ్వర్‌రావుకు కేటాయించడం పొంగులేటిని అసంతృప్తికి గురిచేసింది. పార్టీ నేతల జోక్యంతో ఆ ఎన్నికల్లో బీఆర్‌ఎస్ అభ్యర్థి గెలుపునకు కృషి చేసిన శ్రీనివాసరెడ్డి ఆ తర్వాత జరిగిన పరిణామాలతో పార్టీలో ఇమడ లేక పోయారు. ఈ ఏడాది జనవరి 2 నుంచి పార్టీకి అంటీముట్టనట్లుగా ఉన్న శ్రీనివాస్‌రెడ్డి జూలై 2న కాంగ్రెస్‌లో చేరారు. ఇటీవల జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో భారీ మెజార్టీతో పాలేరు నుంచి ఎమ్మెల్యేగా గెలుపొందారు. రేవంత్‌రెడ్డి మంత్రివర్గంలో కీలకమైన రెవెన్యూ, గృహనిర్మాణ, సమాచార శాఖలు నిర్వహిస్తున్న ఆయన ఉమ్మడి వరంగల్ జిల్లా ఇన్‌చార్జ్ మంత్రిగా నియమితులయ్యారు. కాగా తాజాగా నియామకమైన జిల్లా ఇన్‌చార్జ్ మంత్రి ఏసీడీపీ తదితర నిధుల వినియోగం, ఎమ్మెల్యే, ముఖ్యనేతలను సమన్వయం చేయడంలో కీలకంగా వ్యవహరించడంతో పాటు ఉమ్మడి వరంగల్ జిల్లాలోని ప్రభుత్వ కార్యక్రమాలను, పథకాల అమలును పర్యవేక్షిస్తారు.

యేసు ప్రభువు ఆరాధనలో..



ఉండ్రుపుర చర్చిలో కేక్ కట్ చేస్తున్న పాస్టర్లు



దేవరుప్పుల: బాలయేసులో కేక్ కట్ చేస్తున్న మతగురువులు

నేడు క్రిస్మస్ పండుగ

- ఆధ్యాత్మికతను చాటుకుంటున్న ప్రార్థనా మందిరాలు
- జిల్లా వ్యాప్తంగా సందడి

జనగామ: కరుణామయుడు, పరిశుద్ధాత్ముడు, లోక రక్షకుడి పుట్టిన రోజు వేడుకలను పురస్కరించుకుని నేడు (సోమవారం) క్రిస్మస్ పండగకు చర్చీలు ముస్తాబయ్యాయి. విద్యుత్ దీపాలంకరణలో చర్చీలు దేదీప్యమానంగా వెలుగొందుతున్నాయి. జిల్లాలోని జనగామ, స్టేషన్‌ఘన్‌పూర్, పాలకుర్తి నియోజకవర్గాల పరిధిలో క్రీస్తు ఆరాధనాలయాలు భక్తి భావంతో విరాజిల్లుతున్నాయి. చర్చిల్లో ప్రత్యేక ప్రార్థనలతో ఆరాధకులు సంబురాలను ప్రారంభించగా, నక్షత్రాలు, క్రిస్మస్ ట్రీలతో పండగకు స్వాగతం పలుకుతున్నారు. పవిత్రమైన క్రిస్మస్‌ను పురస్కరించుకుని ఉదయం నుంచి రాత్రి వరకు ఆధ్యాత్మిక, సాంస్కృతిక కార్యక్రమాలను నిర్వహించనున్నారు. క్రైస్తవులు నెలంతా హాలిడే సీజన్‌గా భావిస్తూ ఏసును స్మరించుకుంటారు. అర్ధరాత్రి 12 గంటలకు పట్టణంలోని ఆయా చర్చిల్లో కేకలను కట్ చేసి, ఏసు ప్రభువును కొలిచారు.

విద్యుత్‌దీపాలంకరణలో..

క్రిస్మస్ వేడుకలను పురస్కరించుకుని జిల్లా వ్యాప్తంగా చర్చీలు విద్యుత్‌దీపాలంకరణలో కాంతులీనుతున్నాయి. ఇంటి ముందు నక్షత్రాలు, క్రిస్మస్ ట్రీలతో పండగ వేడుకలకు ఆరంభ సూచికగా ఇవి కనిపిస్తున్నాయి. ఇప్పటికే ఆరాధకులు సంబురాలను ప్రారంభించారు. నృత్యాలు, శాంతి సందేశాలు, ప్రేమ సూక్తులు కనిపిస్తున్నాయి. జనగామ, స్టేషన్ ఘన్‌పూర్, పాలకుర్తి నియోజకవర్గాల పరిధిలో క్రీస్తు ఆరాధనాలయాలు భక్తి భావంతో విరాజిల్లుతున్నాయి. క్రైస్తవులు ఏసును స్మరించుకుంటారు. క్రీస్తును లోకంలోకి ఆహ్వానిస్తూ క్రైస్తవులు ప్రత్యేక ప్రార్థనలు చేస్తున్నారు. రక్షకుడు లోకంలోకి వచ్చిన సందర్భంగా కేక్‌లు కట్ చేసి సంబురాలను జరుపుకోనున్నారు.

కిటకిటలాడుతున్న ఫ్యాన్సీ స్టోర్స్

ఇంటి వద్ద స్టార్ గుర్తు, క్రిస్మస్ చెట్లను ఏర్పాటు చేసుకోవడం శుభ సూచికంగా భావిస్తారు. ప్రత్యేక అలంకరణ కోసం ఇంటిని విద్యుత్ దీపాలతో సర్వాంగ సుందరంగా అలంకరించడం విశేషం. పచ్చదనానికి సూచనగా క్రిస్మస్ ట్రీ అని, దారి చూపించే వెలుగుకు సంకేతంగా స్టార్ గుర్తుగా భావిస్తారు. దీంతో పాటు శాంతక్లాజ్, మేరీమాత బొమ్మలకు కొనుగోలు చేస్తున్నారు. క్రైస్తవులతో ఫ్యాన్సీ స్టోర్స్‌లో సందడి మొదలైయింది. స్టార్లు, ట్రీ, విద్యుత్ దీపాలు తదితర ఫ్యాన్సీ ఐటెంలను కొనుగోలు చేస్తున్నారు.

జోరుగా వ్యాపారాలు

క్రిస్మస్ వేడుకలను పురస్కరించుకుని జిల్లాలో వ్యాపారం జోరుగా సాగింది. స్టార్, ట్రీ, ఫ్యాన్సీ స్టోర్స్‌లతో పాటు వస్త్ర వ్యాపారాలు కిటకిటలాడాయి. శాంత క్లాజ్.. మేరీమాత బొమ్మలు పెద్ద ఎత్తున కొనుగోలు చేశారు.

విద్యార్థుల క్షేత్ర పర్యటన

విద్యారణ్యపురి: హనుమకొండలోని ప్రభుత్వ మర్కజీ హైస్కూల్‌లో వృత్తి విద్యాకోర్సులు చేస్తున్న విద్యార్థినులు ఆదివారం పారిశ్రామిక క్షేత్ర సందర్శనలో భాగంగా వరంగల్ కొత్తవాడలోని శతరంజి చేనేత పారిశ్రామిక ఉత్పత్తి సాహకార సంఘాన్ని పరిశీలించారు. వివిధ రకాల చేనేత వస్త్రాల తయారీ, వాటికి వినియోగించే ముడిసరుకు, కార్మికుల నైపుణ్యం, మెలకువలు, యంత్రాల పని తీరును తెలుసుకున్నారు. ఈ సందర్భంగా వృత్తి విద్యాశిక్షకురాలు ముస్కే శిరీష మాట్లాడుతూ.. ఇలాంటి క్షేత్ర పర్యటనలు విద్యార్థుల్లో నైపుణ్యాలను పెంచుతాయని అన్నారు. ఈ పర్యటనలో జీవీ. రామారావు, కంది శ్రీనివాస్‌రెడ్డి, నంద్యాల చందర్, ఉల్లివెంకటేశ్వర్లు, వీరలింగం పాల్గొన్నారు.



చేనేత వస్త్రాల తయారీ విధానాన్ని పరిశీలిస్తున్న విద్యార్థులు

ఆంజనేయస్వామికి వెండి కవచం



వెండి కవచం ధరించి ఉన్న స్వామి వారితో దాతలు, అర్చకులు, కమిటీ సభ్యులు

కాశిబుగ్గ: గ్రేటర్ వరంగల్ 18వ డివిజన్ లేబర్ కాలనీ చెన్నారెడ్డికాలనీ శ్రీ పంచముఖ నాగవీరేశ్వరాలయంలోని భక్తాంజనేయస్వామికి అదే కాలనీకి చెందిన రిటైర్ డీఈ మడూరి వేణు, పద్మావతి దంపతులు ఆదివారం రూ.3.50 లక్షల విలువైన వెండి కవచాన్ని సమర్పించారు. అనంతరం ఆంజనేయ స్వామికి కవచం ధరించి(తొడగి) పూజలు చేసి భక్తులకు దర్శనం కల్పించారు. ఆలయ ప్రధాన అర్చకులు శివశ్రీ భోగేశ్వర శాస్త్రి, కిరణ్ శాస్త్రి, రాజశేఖర్, ధర్మకర్త భూదేవి, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

కళలపై ఆసక్తి పెంచుకోవాలి

- ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి
- జిల్లా స్థాయి కళాకారుల ఎంపిక



బహుమతులు అందజేస్తున్న ఎమ్మెల్యే

జనగామ రూరల్: సమాజంలో యువత, విద్యార్థులు కళలపై ఆసక్తి పెంచుకోవాలని ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి అన్నారు. ఆదివారం పట్టణంలోని జూబ్లీ ఫంక్షన్ హాల్‌లో 2024వ యువజనోత్సవాల్లో పాల్గొని జిల్లా స్థాయి కళాకారుల ఎంపికలను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ యువ కళాకారులు తమ ప్రతిభను బయటకు తీయడానికి ఇలాంటి అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. ప్రభుత్వం కల్పించే అవకాశాలను అందిపుచ్చుకొని జీవితంలో స్థిరపడాలన్నారు. అనంతరం యువ కళాకారులు పోటీల్లో పాల్గొనగా వారికి సర్టిఫికెట్స్ అందజేశారు. మెరిట్ సాధించిన కళాకారులు రాష్ట్ర స్థాయి యువజనోత్సవాల్లో పాల్గొంటారన్నారు.

విజేతలు వీరే

జానపద బృంద నృత్యంలో ఎం.కోమలత, ద్వితీయ బహుమతి బి.రాంచరణ్ సోలోలో డి. కావ్య శ్రీవాణి, ద్వితీయ బహుమతి ఆర్.అంజలి, జి.సునీల్, ఎస్.ప్రత్యూష, లైఫ్ స్కిల్స్‌లో వ్యాసరచనలో కె.సుస్మిత, ద్వితీయ బహుమతి జి.మనోహర్, పోస్టర్ మెకింగ్‌లో ప్రథమ బహుమతి టీ.విక్రం, ద్వితీయ బహుమతి పి.శృతి, వకృత్వంలో ప్రథమ బహుమతి పి.అంకిత, ద్వితీయ బహుమతి ఎన్.ప్రవలిక, ఫొటో గ్రఫిలో కె.హరిక ద్వితీయ బహుమతి ఏ.దివ్య బహుమతులు అందుకున్నారు.

క్లుప్తంగా

వరంగల్ మార్కెట్ ఇన్‌చార్జ్ కార్యదర్శిగా బియాబానీ

వరంగల్: వరంగల్ ఏనుమాముల వ్యవసాయ మార్కెట్ కమిటీ ఇన్‌చార్జ్ కార్యదర్శిగా గ్రేడ్–2 కార్యదర్శి బియాబానీ బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ పనిచేస్తున్న బీవీ.రాహుల్ ఓడీ రద్దు చేస్తూ సూర్యాపేటలో జాయిన్ కావాలని ఉత్తర్వుల్లో పేర్కొనడంతో శనివారం బియాబానీకి బాధ్యతలు అప్పగించి రిలీవ్ అయ్యారు. వరంగల్ కార్యదర్శిగా సంగయ్య బుధవారం బాధ్యతలు చేపట్టనున్నారు.

ఆర్‌పీఎఫ్ ఎస్సై శ్రావణికి రైల్వే జీఎం అవార్డు


అవార్డు అందుకుంటున్న ఆర్‌పీఎఫ్ ఎస్సై శ్రావణి

కాజీపేట రూరల్ : రైల్వే ప్రొటెక్షన్ ఫోర్స్(ఆర్‌పీఎఫ్) కాజీపేట ఎస్సై ఐ.శ్రావణికి దక్షిణ మధ్య రైల్వే జనరల్ మేనేజర్ (జీఎం) అవార్డు లభించింది. శ్రావణి 2020 సంవత్సరంలో కాజీపేట ఆర్‌పీఎఫ్ పోలీస్‌స్టేషన్‌లో ఎస్సైగా బాధ్యతలు స్వీకరించారు. ఈ క్రమంలో సికింద్రాబాద్ ఆర్‌పీఎఫ్ అధికారులు నాగమ్మ శక్తి టీం విభాగం ఏర్పాటు చేసి దీనికి శ్రావణిని లీడర్‌గా నియమించారు. దీంతో శ్రావణి రైళ్లు, రైల్వే స్టేషన్లలో మహిళా ప్రయాణికులకు భద్రత, అవగాహన కల్పిస్తున్నారు. ఇందులో భాగంగా 2020–23 సంవత్సరానికి సంబంధించి బెస్ట్ ఫర్మామెన్స్, హార్డ్ వర్క్‌గా రైల్వే జీఎం అవార్డుకు ఎంపికయ్యారు. ఈ నెల 22వ తేదీన సికింద్రాబాద్ రైల్ నిలయంలో రైల్వే జీఎం ఎ.కె.జైన్ చేతుల మీదుగా శ్రావణి అవార్డు, ప్రశంస పత్రం అందుకున్నారని కాజీపేట ఆర్‌పీఎఫ్ సీఐ సంజీవరావు ఆదివారం తెలిపారు.

అతడు కీచకుడే..

అందమైన విద్యార్థినుల పట్ల అసభ్యకర ప్రవర్తన


నిందితుడి అరెస్టు చూపుతున్న ఏసీపీ కిరణ్‌కుమార్

- లైంగిక వాంఛ తీర్చుకోవడానికి ఫీజు మాఫీ, డబ్బుల ఎర
- వినకుంటే చంపుతా.. ఫెయిల్ చేస్తానని బెదిరింపులు
- పోలీసుల విచారణలో వెల్లడి..
- నిందితుడు సురేందర్ గౌడ్, అతడికి సహకరించిన మెస్ ఇన్‌చార్జ్ శ్రవణ్ అరెస్టు.. రిమాండ్

హసన్‌పర్తి: హనుమకొండ జిల్లా భీమారంలోని శ్రీ చైతన్య కళాశాల అధ్యక్షుడు బూర సురేందర్ గౌడ్ కీచకుడని తేలింది. పోలీసుల విచారణలో విస్తుపోయే నిజాలు వెల్లడయ్యాయి. ఈమేరకు నిందితుడు సురేందర్‌గౌడ్‌తో పాటు అతడికి సహకరించిన మెస్ ఇన్‌చార్జ్ శ్రవణ్‌ను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు హనుమకొండ ఏసీపీ కిరణ్‌కుమార్ వెల్లడించారు. ఇందుకు సంబంధించిన వివరాలు ఆదివారం వెల్లడించారు. హసన్‌పర్తి మండలం భీమారానికి చెందిన బూర సురేందర్‌గౌడ్ స్థానికంగా శ్రీ చైతన్య ప్రైవేట్ జూనియర్ కళాశాల నిర్వహిస్తున్నాడు. నాలుగు అంతస్తుల భవనం.. గ్రౌండ్ ఫ్లోర్‌లో కళాశాల కార్యాలయం, మొదటి ఫ్లోర్‌లో తరగతులు, రెండు, మూడు ఫ్లోర్లలో హాస్టల్, నాలుగో ఫ్లోర్‌లో ఇద్దరు భార్యలు రేణుక, సంధ్య, ఇద్దరు పిల్లలతో సురేందర్‌గౌడ్ నివాసముంటున్నాడు. ప్రస్తుతం బాలికల క్యాంపస్‌లో 160 మంది విద్యార్థినులు చదువుకుంటున్నారు.

అర్ధరాత్రి ఫోన్ చేసి..

ఈనెల 22వ తేదీ రాత్రి సుమారు 11.30 గంటల సమయంలో హాస్టల్‌లో ఉన్న ఆ విద్యార్థినికి శ్రవణ్ ఫోన్ చేసి కిందికి రమ్మన్నాడు. భయపడిన ఆ విద్యార్థిని స్నేహితులతో కలిసి గ్రౌండ్ ఫ్లోర్‌లోకి వచ్చింది. వారిని చూసిన సురేందర్‌రెడ్డి ఆగ్రహంతో ఆ విద్యార్థినిని దూషించడమే కాకుండా బెదిరింపులకు గురిచేశాడు. అడ్డుగా వచ్చిన మరో విద్యార్థినిపై చేయి చేసుకుని అక్కడి నుంచి సురేందర్, శ్రవణ్ పరారయ్యారు. కళాశాలలో అందమైన అమ్మాయిలు కనిపిస్తే చాలు.. సురేందర్ గౌడ్ వారితో లైంగిక వాంఛ తీర్చుకోవడానికి యత్నించే వాడని, అసభ్యంగా ప్రవర్తించే వాడని ఏసీపీ కిరణ్‌కుమార్ వివరించారు.

విద్యార్థినిపై కన్ను..

హాస్టల్‌లో ఉంటూ కళాశాలలో చదువుతున్న ఓ విద్యార్థినిపై కన్ను వేసిన సురేందర్‌గౌడ్ లైంగిక వాంఛ తీర్చుకోవడానికి యత్నించాడు. ఇందుకు ఫీజు మాఫీ చేస్తానని.. డబ్బులు కూడా ఇస్తానని మభ్యపెట్టాడు. ఇందుకు హాస్టల్‌లో మెస్‌చార్జ్‌గా పని చేస్తున్న చెన్నారావుపేటకు చెందిన శ్రవణ్ సహకారం తీసుకున్నాడు. పలుమార్లు మాటలతో వేధించడమే కాకుండా అసభ్యకరంగా వ్యవహరించినా ఆ విద్యార్థిని లొంగలేదు.

విద్యార్థి సంఘాల ఆందోళన..

కళాశాలలో చోటు చేసుకున్న ఈ ఘటనపై విద్యార్థి సంఘాలు ఆందోళన నిర్వహించాయి. ఈమేరకు విద్యార్థిని తల్లిదండ్రులు పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా.. రంగంలోకి దిగిన పోలీసులు ఆదివారం వడ్డేపల్లి చర్చి వద్ద సురేందర్, శ్రవణ్‌ను అదుపులోకి తీసుకుని విచారించగా ఘటనకు సంబంధించిన వాస్తవాలు అంగీకరించారని ఏసీపీ చెప్పారు. సమావేశంలో సీఐ అబ్బయ్య, ఎస్సై సురేష్ తదితరులు పాల్గొన్నారు.

జాగ్రత్తలతో మామిడిలో మెరుగైన పూత

- ఉద్యానశాఖ అధికారి రమేశ్

చెన్నారావుపేట: మామిడి చెట్లు పూత పూసే సమయం ఆసన్నమైంది. కొన్ని ప్రాంతాల్లో వర్షాపాతం తక్కువగా నమోదైంది. ఇటీవల 'మిచాంగ్' తుపాను ప్రభావంతో కురిసిన వర్షాలకు అనేక చోట్ల పంటలకు తీవ్ర నష్టం వాటిల్లింది. చాలా చోట్ల సాగు భూములు తడిగా మారాయి. ఈ పరిస్థితుల్లో మామిడి పూత బాగా రావడానికి రైతులు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని ఉద్యానశాఖ అధికారి రమేష్ తెలిపారు. ఆయన మామిడి రైతులకు ఆదివారం పలు సూచనలు చేశారు.

మామిడి తోటలను రైతులు తేలికగా దున్నుకోవాలి. తద్వారా భూమి లోపల తేమ ఆవిరై పూత రావడానికి అవకాశం ఉంటుంది. సాధారణంగా మామిడిని ఆశించే చీడలు తోటల్లోని కలుపు, చెత్తచెదారాల్లో ఆశ్రయం పొందుతాయి. ఈ సమయంలో మామిడి తోటలో తేలికగా దున్నడం వల్ల కలుపు నివారించవచ్చు. తోటలో చెత్తాచెదారాన్ని తొలగిస్తే చీడల బెడదను చాలా వరకు తగ్గించొచ్చు.

పూత బాగా రావాలంటే

తోటల్లో దున్నిన తర్వాత చెట్లకు పొటాషియం నైట్రేట్ (13–0–45/మల్టికే, లీటరు నీటికి 10–15 గ్రాములు) అర్కా మ్యాంగో స్పెషల్ (లీటర్ నీటికి 5 గ్రాములు) లేదా ఫార్ములా–4 సూక్ష్మ పోషకాల మిశ్రమాన్ని లీటర్ నీటికి 3 గ్రాములు కలిపి పిచికారీ చేయాలి. దీంతో చెట్లలో పూత మొగ్గలు ఉత్తేజితమై పూత బాగా వస్తుంది.

తేనె మంచు పురుగుల నివారణ

మామిడిలో పూతకు ముందు తేనే మంచు పురుగులు, కలుపు చెత్తచెదారాల్లో దాగి ఉంటాయి. డిసెంబర్ రెండో పక్షం నుంచి ఈ పురుగులు చెట్ల కాండము, కొమ్మలపైకి ఎగబాకుతుంటాయి. ఈ నేపథ్యంలో డిసెంబర్ మూడో వారంలో లీటరు నీటికి 1.5 గ్రాముల అసిఫేట్ లేదా క్లోరిపైరిపాస్ 50 ఈసీ లీటరు నీటికి 1 మిల్లీలీటరు మందుతో అజాడిరక్టిన్ 10 వేల పీపీఎం లీటరు నీటికి 2 మిల్లీలీటర్లు కలిపి కాండము, కొమ్మలు బాగా తడిసేలా స్ప్రే చేస్తే తొలిదశలో పురుగులను నివారించవచ్చు.


రైతులకు సూచనలు ఇస్తున్న రమేశ్

చీడల నివారణ

మామిడి చెట్లలో జనవరిలో పూ మొగ్గలు రావడం మొదలవుతుంది. మామిడిని తేనే మంచు పురుగు, మిడ్జి పురుగు, పేను, బూడిద తెగులు ఆశించి నష్టపరుస్తాయి. ఈ చీడల నివారణ కోసం చెట్లలో పూత ప్రారంభ దశలో మొగ్గలుగా ఉన్నప్పుడే చర్యలు చేపట్టాలి. ఇమిడాక్లోప్రిడ్ లీటరు నీటికి 0.5 ఎంఎల్ లేదా బూప్రొపెజిన్ లీటరు నీటికి 2 ఎంఎల్ లేదా థయామిథాక్సాం లీటరు నీటికి 1 గ్రాము కలిపి పిచికారీ చేస్తే చీడలను అదుపు చేయవచ్చు. మామిడి చెట్లలో పూత పూర్తిగా వచ్చిన దశలో మందులను చెట్లపై స్ప్రే చేయవద్దు. స్ప్రే చేస్తే పిందె ఏర్పడడానికి అనవరమైన పూతలోని పుప్పొడి కొట్టుకుపోతుంది. పిందె ఏర్పడడానికి సాయపడే తేనేటిగలు చనిపోతాయి. ఈ దశలో మందులు కొడితే మేలు కంటే కీడే ఎక్కువగా జరుగుతుంది.

నీటిని నిర్లక్ష్యం చేయొద్దు

మామిడిలో పూత తర్వాత పిందే కట్టే సమయంలో చెట్లకు నీరు పెట్టాలి. దీంతో పూత పిందె రాలడం తగ్గి, పిందెలు మంచి సైజుకు పెరుగుతాయి. పిందెలు ఏర్పడే దశ నుంచి 15 రోజుల వ్యవధిలో 2–4 సార్లు చెట్లకు నీటి తడులు పెట్టడం వల్ల మంచి ఫలితాలు వస్తాయి.

మామిడిలో చీడ నివారణకు మందులను నిపుణులు, సంబంధిత అధికారుల సూచనల మేరకే వాడాలి. వారు సూచించిన మందులను సిఫార్సు చేసిన మోతాదులోనే రైతులు వినియోగించాలి. ఈ విషయంలో పురుగు మందుల వ్యాపారులు లేదా మందుల స్ప్రే చేసే వారి ప్రమేయం లేకుండా చూసుకోవాలి.

అంబేడ్కర్ విగ్రహాల ఏర్పాటుకు కృషి


మాట్లాడుతున్న వెంకటేశ్వర్లు

హన్మకొండ: భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహాలను ప్రతి జిల్లా, నియోజకవర్గ, మండల, గ్రామ కేంద్రాలలో ఏర్పాటు చేసేలా కృషి చేస్తామని తెలంగాణ మాల పోరాట సమితి రాష్ట్ర అధ్యక్షుడు పెరుమాండ్ల వెంకటేశ్వర్లు అన్నారు. టీఎంపీఎస్ రాష్ట్ర కమిటీ సమావేశం ఆదివారం హనుమకొండ పద్మాక్షికాలనీలోని సమితి జిల్లా కార్యాలయంలో జరిగింది. ఈ సమావేశానికి వెంకటేశ్వర్లు ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడుతూ సినిమా ద్వారా అంబేడ్కర్ చరిత్రను ప్రజలకు తెలియజేసేందుకు కృషి చేస్తామన్నారు. సమావేశంలో సంఘం జిల్లా కన్వీనర్ సదువాల శ్రావణ్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శులు అంకేశ్వరపు రమేష్, మేరుగు నర్సింహాస్వామి, ఉపాధ్యక్షుడు మగ్గిడి అజయ్, కార్యదర్శులు తరాల శంకర్, శ్రీరాముల పైడి, మ్యాదరి సునీల్, దండెం రాజ్‌కుమార్, ఆర్ల శంకర్, వేల్పుల యాకూబ్, బండారి చంద్రయ్య, దాసరి రాజు, జెమ్మల నాగరాజు, కరాటే శ్రీను, బన్నె రాజు తదితరులు పాల్గొన్నారు

ఊడిపోయిన ఆర్టీసీ బస్సు చక్రాలు

- ప్రయాణికులకు స్వల్ప గాయాలు



ఎల్కతుర్తి : హుజూరాబాద్ నుంచి హనుమకొండ వైపునకు వెళ్తున్న హుజూరాబాద్ డిపోనకు చెందిన ఓ ఆర్టీసీ బస్సు వెనుక చక్రాలు ఒక్కసారిగా ఊడిపోయాయి. ఓవర్ లోడ్‌తో వెళ్తుండగా ఎల్కతుర్తి సమీపంలో జరిగిన ఈ ఘటనలో డ్రైవర్ చాకచక్యంగా వ్యవహరించి బస్సును నిలిపివేశాడు. దీంతో పెను ప్రమాదం తప్పింది. కాగా, బస్సులో సుమారు 80 మంది ప్రయాణికులు ఉన్నట్లు సమాచారం. పలువురు ప్రయాణికులకు స్వల్ప గాయాలైనట్లు తెలిసింది. కాగా, ఈ ఘటనపై ఆర్టీసీ ఎండీ సజ్జనార్ స్పందించారు. ఓవర్ లోడ్ కారణంగా ఘటన జరగలేదని, దీనిపై విచారణ చేపట్టి చర్యలు తీసుకుంటామని తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో ఐదుగురికి గాయాలు


బాధితులతో మాట్లాడుతున్న రవీందర్‌రావు

నర్సంపేట రూరల్ : రోడ్డు ప్రమాదంలో ఐదుగురికి తీవ్ర గాయాలయ్యాయి. ఈ ఘటన ఆదివారం నర్సంపేట మండలం లైన్‌తండాలో జరిగింది. ఖానాపూర్ మండలం అశోక్‌నగర్‌కు చెందిన 15 మంది కూలీలు పత్తి ఏరేందుకు నర్సంపేట మండలం లైన్‌తండా సమీపంలోని వ్యవసాయ క్షేత్రానికి ఆటోలో వచ్చారు. అయితే అక్కడ రోడ్డు సరిగా లేకపోవడంతో ఆటోను అక్కడే వదిలి నడుచుకుంటూ వెళ్తున్నారు. అటుగా వెళ్తున్న ట్రాక్టర్‌లో ఎక్కారు. అయితే దారి పూర్తిగా గుంతలమయంగా ఉంది. ట్రాక్టర్ గుంతల నుంచి వెళ్తుండగా ఒక్కసారిగా ఒరగింది. దీంతో కూలీలు ఒకరిపై ఒకరుపడిపోయారు. ఈ ఘటనలో బండోజు శోభ, నార్లాపురం మల్లికాంబ, వల్లెపు రామక్క, అచ్చమ, దేవికకు తీవ్రగాయాలయ్యాయి. వెంటనే స్థానికులు గమనించి నర్సంపేట ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. కాగా, ఈ ఘటనపై సమాచారం అందుకున్న ఎస్సై రాజ్‌కుమార్ ఆస్పత్రికి చేరుకుని ఘటన వివరాలు నమోదు చేసుకున్నారు. అలాగే, కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జ్, మాజీ ఎంపీపీ తక్కళ్లపల్లి రవీందర్ ప్రభుత్వ ఆస్పత్రికి చేరుకొని బాధితులను ఓదార్చారు. మెరుగైన వైద్యసేవలు అందించాలని వైద్యులకు సూచించారు.

పార్క్ చేసిన కారు దగ్ధం..

- పుప్పాల గుట్టలో ఘటన
- అన్న కుమారుడే దగ్ధం చేశాడని బాధితుడి ఆరోపణ


దగ్ధమైన కారు

ఖిలా వరంగల్ : వరంగల్– పుప్పాల గుట్ట ప్రధాన రహదారిపై ఓ ఇంటి ఎదుట పార్క్ చేసిన కారు దగ్ధమైంది. ఈ ఘటనను చూసిన స్థానికులు వెంటనే స్పందించి మంటలు ఆర్పేశారు. దీంతో పెనుప్రమాదం తప్పింది. ఎస్సై రాజు కథనం ప్రకారం.. శివనగర్ పుప్పాలగుట్టకు చెందిన ఇనుముల అజయ్ తన కారును ఇంటి ఎదుట పార్క్ చేశారు. ఇదిలా ఉండగా కొంత కాలంగా అన్నదమ్ములు ఇనుమలు సుధాకర్, అజయ్ మధ్య ఆస్తి పంపకం.. డబ్బుల విషయంలో గొడవలు జరుగుతున్నాయి. ఈ విషయంలో అజయ్ తమకు అన్యాయం చేస్తున్నారని, అతడిపై తన అన్న కుమారుడు మహేష్ కక్షపెంచుకున్నాడు. ఈ నేపథ్యంలో శనివారం అర్ధరాత్రి మహేష్ తన తల్లిని బైక్‌పై తీసుకుని అజయ్ ఇంటి ముందుకు చేరుకున్నారు. అనంతరం ఇంటి ఎదుట పార్క్ చేసిన కారుపై పెట్రోల్ చల్లి నిప్పు అంటించారు. దీంతో ఒక్కసారిగా మంటలు వ్యాపించాయి. ఎగిసిపడుతున్న మంటలతో కారు టైర్ పేలి భారీ శబ్దం రావడంతో నిద్రిస్తున్న అజయ్‌తోపాటు కాలనీ ప్రజలు ఉలిక్కిపడ్డారు. వెంటనే కారుపై నీరు చల్లి మంటలను అదుపులోకి తీసుకొచ్చారు. కారు దగ్ధం చేసిన దుండగుల ఆచూకీ కోసం ఇంట్లోని సీసీ ఫుటేజీని పరిశీలించగా తన అన్న కుమారుడు మహేష్, అతని తల్లి హైమావతి అని తేలిందని బాధితుడు అజయ్ తెలిపారు. ఈ విషయాన్ని వెంటనే మిల్స్‌కాలనీ పోలీసులకు తెలుపగా వారు హుటాహుటిన ఘటనా స్థలికి చేరుకుని వివరాలు సేకరించారు. అనంతరం అజయ్ ఫిర్యాదు మేరకు ఆదివారం మహేష్, అతడి తల్లి హైమావతిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై రాజు తెలిపారు.

విద్యుదాఘాతంతో రైతు మృతి


బుర్ర వేణు(ఫైల్)

నెల్లికుదురు : విద్యుదాఘాతంతో ఓ రైతు మృతి చెందిన సంఘటన మహబూబాబాద్ జిల్లా నెల్లికుదురు మండలం శ్రీరామగిరి శివారు వెంకటాపురం గ్రామంలో ఆదివారం జరిగింది. ఎస్సై క్రాంతికిరణ్ తెలిపిన వివరాల ప్రకారం.. వెంకటాపురం గ్రామానికి చెందిన రైతు బుర్ర వేణు(40) తనకున్న మూడెకరాల పొలానికి నీరు పారిస్తుండగా కరెంట్ పోయింది. దీంతో అతను సమీపంలో ఉన్న విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ వద్దకు వెళ్లి చూడగా ఫీజ్ పోయిందని గమనించాడు. అక్కడికి వెళ్లి ట్రాన్స్‌ఫార్మర్ వద్ద ఫీజ్ సరిచేస్తున్న క్రమంలో విద్యుత్ షాక్‌కు గురై వేణు అక్కడికక్కడే మృతి చెందినట్లు మృతుడి భార్య సుజాత ఫిర్యాదులో పేర్కొన్నట్లు ఎస్సై తెలిపారు. మృతుడికి భార్య కూతురు, కుమారుడు ఉన్నారు.

చికిత్స పొందుతున్న వ్యక్తి..


బుచ్చిరెడ్డి (ఫైల్)

చెన్నారావుపేట : మనస్తాపంతో ఆత్మహత్యకు యత్నించిన ఓ వ్యక్తి చికిత్స పొందుతూ మృతి చెందాడు. ఈ ఘటన మండలంలోని లింగాపురంలో చోటు చేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం.. గ్రామానికి చెందిన మూందాటి బుచ్చిరెడ్డి (65), తన సోదరుడు కుమారస్వామి మధ్య కొది రోజుల నుంచి భూమి, ఆస్తి తగాదాలు జరుగుతున్నాయి. ఈ తగాదాలో తనకు భూమి వస్తుందో రాదో అని మనస్తాపానికి గురైన బుచ్చిరెడ్డి ఈ నెల 22న పురుగుల మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. కుటుంబీకులు గమనించి వెంటనే హనుమకొండలోని ఓ ప్రైవేట్ ఆసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ ఆదివారం మృతి చెందాడు. మృతుడికి భార్య లక్ష్మి, ముగ్గురు కుమార్తెలు ఉన్నారు. ఈ ఘటనపై లక్ష్మి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై శ్రీనివాస్ తెలిపారు. కాగా, ఈ విషయం తెలుసుకున్న మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్ రెడ్డి.. బుచ్చిరెడ్డి మృతదేహంపై పూలమాలలు వేసి నివాళులర్పించారు.

యువకుడి అదృశ్యం


అరవింద్(ఫైల్)

తొర్రూరు రూరల్: మండలంలోని మడిపల్లి గ్రామానికి చెందిన ఓ యువకుడు అదృశ్యమయ్యాడు. గ్రామానికి చెందిన పేర్ల అరవింద్ (19) ఈనెల 18న ఇంటి నుంచి వెళ్లిపోయాడు. ఇప్పటి వరకూ తిరిగి రాలేదు. దీంతో ఆందోళనకు గురైన కుటుంబీకులు ఆదివారం పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీంతో కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై జగదీష్ తెలిపారు.

సంక్షేమ హాస్టళ్లలో ఆకలి కేకలు

- కుళ్లిన కూరగాయలు, ముక్కిన బియ్యం
- రోడ్డెక్కిన విద్యార్థులు, తల్లిదండ్రులు
- ప్రిన్సిపాల్‌ను సస్పెండ్ చేయాలని ధర్నా


రహదారిపై ధర్నా చేస్తున్న విద్యార్థులు, తల్లిదండ్రులు

రేగొండ : రుచిగా ఉండాల్సిన హాస్టల్ బువ్వ కలుషితమవుతోంది. అదే అన్నం విద్యార్థులకు పెట్టడంతో తీవ్ర అస్వస్థతతో ఆస్పత్రి పాలవుతున్నారు. మండల కేంద్రంలోని మహాత్మా జ్యోతిరావు పూలే పాఠశాలలో వసతులు లేవని నిరసిస్తూ ఆదివారం విద్యార్థుల తల్లిదండ్రులు పరకాల–భూపాలపల్లి రోడ్డుపై ధర్నా చేపట్టారు. పాఠశాలలో ఏడో తరగతి చదువుతున్న విద్యార్థి కార్తీక్ మూడు రోజుల క్రితం టాయిలెట్‌కు వెళ్తుండగా కాలు జారి పడ్డాడు. గాయమైన విషయం తల్లిదండ్రులకు చెప్పకుండా ప్రిన్సిపాల్, హెల్త్ సూపర్‌వైజర్ నిర్లక్ష్యం చేశారని తల్లిదండ్రులు ఆందోళన వ్యక్తం చేశారు. భూపాలపల్లి జిల్లా కేంద్రంలో నిర్వహించాల్సిన మహాత్మా జ్యోతిరావు పూలే బాలుర గురుకుల పాఠశాలను మండలంలోని ఓ ప్రైవేట్ పాఠశాలలో నిర్వహిస్తున్నారు. పాఠశాల ప్రారంభమైనప్పటి నుంచి ఇప్పటి వరకు బిల్డింగ్ నిర్మాణం కొనసాగుతూనే ఉందని, దీంతో విద్యార్థులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారని తల్లిదండ్రులు వాపోయారు. పాఠశాలలో దాదాపు 480 మంది విద్యార్థులు ఉండగా వారికి సరిపడా మరుగుదొడ్లు లేవని, ఉన్నవి కూడా అపరిశుభ్రంగా ఉన్నాయన్నారు. ఆదివారం విజిటింగ్‌కు వచ్చిన తల్లిదండ్రులకు ముక్కిన బియ్యంతో అన్నం వండుతున్నారని, కుళ్లిన కూరగాయలతో కూరలు వండుతున్నారని విద్యార్థులు తెలిపారు. దీంతో ఆగ్రహించిన తల్లిదండ్రులు పాఠశాల ఎదుట ప్రధాన రహదారిపై బైఠాయించి ధర్నా నిర్వహించారు. ట్రాఫిక్ జామ్ కావడంతో రెండో ఎస్సై తీగల మాధవ్ వారి వద్దకు చేరుకుని ఉన్నతాధికారులతో మాట్లాడి సమస్యను పరిష్కారిస్తానని హామీ ఇవ్వడంతో తల్లిదండ్రులు ధర్నాను విరమించారు. ఈ విషయమై ప్రిన్సిపాల్‌ని వివరణ కోరగా విద్యార్థికి గాయమైన విషయం తన దృష్టికి రాలేదన్నారు. సివిల్ సప్లై వారే పాఠశాలకు బియ్యం రవాణా చేస్తున్నారని, అందులో ముక్కిన బియ్యం సంచులు ఉన్నది వాస్తవమే కానీ వాటిని రిటర్న్ ఇవ్వడానికి పక్కన పెట్టామన్నారు. ఇప్పటి వరకు భోజన విషయంలో ఎలాంటి ఫిర్యాదులు రాలేదన్నారు.

వేటగాళ్ల ఉచ్చులకు వన్యప్రాణుల బలి

- తాజాగా కనుజు మృత్యువాత
- పట్టించుకోని అధికారులు
- రూ.800 చొప్పున మాంసం విక్రయం

ఖానాపురం : పాకాల అటవీ ప్రాంతంలో వేటగాళ్లు రెచ్చిపోతున్నారు. దట్టమైన అటవీ ప్రాంతం కావడంతో వన్యప్రాణుల సంఖ్య రోజురోజుకూ పెరుగుతోంది. ఇదే అదునుగా భావిస్తున్న వేటగాళ్లు కొద్ది నెలల నుంచి ఉచ్చులు పెడుతూ వన్యప్రాణులను చంపుతున్నారు. ఈ క్రమంలో శనివారం రాత్రి చిలుకమ్మనగర్‌కు చెందిన కొందరు వేటగాళ్లు అటవీ ప్రాంతంలో ఉచ్చులు బిగించగా కనుజు చిక్కింది. తెల్లవారు జామున వెళ్లిన వేటగాళ్లు.. సుమారు 110 కిలోల కనుజును మాంసంగా మార్చినట్లు సమాచారం. కిలో మాంసం రూ. 800 చొప్పున విక్రయించారు. స్థానికంగా విక్రయించిన తర్వాత కూడా మాంసం మిగలడంతో నర్సంపేటతో పాటు ఇతర ప్రాంతానికి తరలించి సొమ్ము చేసుకున్నట్లు తెలిసింది. ఈ విషయం ఫారెస్ట్ అధికారులకు తెలిసినా పట్టించుకోలేదనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. కాగా, వన్యప్రాణులను చంపడంపై స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. అటవీ ప్రాంతాల్లో ఉచ్చులు, విద్యుత్ తీగలు అమర్చి వన్యప్రాణులను చంపుతున్న వారిపై చర్యలు తీసుకోవాలని, ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా అధికారులు చర్యలు చేపట్టాలని కోరుతున్నారు.

సాక్షి క్లాసిఫైడ్స్

REAL ESTATE

PLOT FOR SALE

■ KUDA, GWMC అప్రూవ్డ్ రెసిడెన్షియల్ ప్లాట్లు చింతగట్టు క్యాంప్ వద్ద తక్కువ ధరలో అమ్మబడును. గజం: 15,000/– మాత్రమే. సంప్ర॥ సంగీత – 9866943026. [W-1229344]

TO-LET

■ వరంగల్ NSPT రోడ్‌కు G+1 బిల్డింగ్‌లో గ్రౌండ్ ఫ్లోర్ 2500 Sft, 1st ఫ్లోర్‌లో 2500 Sft మొత్తం 5000 Sft, హ్యాల్స్, బ్యాంక్స్, షోరూమ్స్, Any Govt Offices కి అనుకూలంగా గలది కిరాయికి ఇవ్వబడును. సెల్: 7013724686. [W-788973]

SERVICES

■ వ్యక్తిగత, వ్యవసాయ, వ్యాపార, ప్రాపర్టీ కొరకు అతితక్కువ వడ్డీతో అమౌంట్ ఇప్పించబడును. Cibil అవసరం లేదు. NPA కూడా దరఖాస్తు. హన్మకొండ. సెల్: 7659010270. [WA-7261]

సెప్టిక్ ట్యాంక్ క్లీనర్

■ మీయొక్క సెప్టిక్ ట్యాంక్స్ నిండినవా? నూతన సాంకేతిక పరిజ్ఞానంతో గల్ఫర్ మిషన్ ద్వారా మీ సెప్టిక్ ట్యాంక్స్ క్లీన్ చేయబడును. సంప్ర॥ డి.యస్. రావు, సెల్: 9849145043. [W-788963]

BUSINESS OFFER

■ లక్ష్మీ సీ ఫుడ్స్ హన్మకొండ వారి వద్ద అపోలో ఫిష్, రవ్వ, రొచ్చు, రొయ్యలు, కొరమీను మరియు సముద్రపు చేపలు. Quality కటింగ్‌తో ఆర్డర్లపై హోల్‌సేల్‌కి సప్లై చేయబడును. ఫోన్: 8807392629 /9885409786 [H-793446]

WANTED

■ Delicious Chicken Outlets is looking for Collections Lead in Warangal. Experience in collections is mandatory. Salary:12K-15K. Cont: 8106112401. [W-788974]

■ PNB Met Life సంస్థ యందు Business Development Officers-5, కావలెను. Salary+ Incentive+ EPF, 26/12/23 రోజున Interview జరుగును. Cell: 8008201769. [W-1229383]

■ Wanted door to door Marketing persons Male / Female No age or Education limit Freshers can apply. Cont: 7997777377. [W-788970]

■ Wanted Managers (Male/Female) House Wife & Retired Person also eligible. Salary: 15,000/- to 20,000/- Cont: 9912333236. [W-1229382]

తాజా వార్తల కోసం లాగాన్ అవ్వండి www.sakshi.com

■ మీ ఇంటి వద్దనే వుండి మీ మొబైల్ ద్వారా మెసేజ్‌లు పంపిస్తూ వారానికి 3500/– సంపాదించుకోండి. వాట్సాప్ చేయండి. 7702518530, 8019341329. [M-1167569]

■ మా ఆఫీసు న్యూ ఫ్రాంచేజ్ ద్వారా మీ ఖాళీ సమయంలో పార్ట్‌టైమ్/ఫుల్ టైమ్ వర్క్ చేస్తూ 15వేలు ఆపైన సంపాదించే అవకాశం. సెల్: 9177736926. [G-824667]

■ హరేకృష్ణ హోంకేర్ హైదరాబాద్ నందు వృద్ధులను పేషెంట్స్‌ను చూసుకొనుటకు వర్కర్స్ / నర్సులు కావలెను. ఫ్రీ వసతి + భోజనం. జీ 18K. Ph: 9640258899, 9640468899. [H-793665]

4 లైన్ల క్లాసిఫైడ్ ప్రకటన 260/– రూ॥
అదనపు లైను 60/– రూ॥ మాత్రమే
5% GST అదనము

ఈ సెక్షన్‌లో ప్రకటనల కొరకై సంప్రదించండి

హన్మకొండ	9010144453
వరంగల్	9705748198
నర్సంపేట	9553955722
జనగామ	9951602871
మహబూబాబాద్	9010144453
పరకాల	9010299096
జయశంకర్ భూపాలపల్లి	9705748198

గమనిక

సాక్షి తెలుగు దినపత్రికలో రోజూ ప్రచురించే క్లాసిఫైడ్ ప్రకటనలు చదివి, వాటిని నిశితంగా పరిశీలించిన పిదప ప్రతిస్పందించాల్సిందిగా మా పాఠకులను కోరడమైనది. ప్రకటనదారు తెలిపే లేదా క్లెయిమ్ చేసే వాటితో ఈ వార్తా పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.